
మూసాపేట్ జనతానగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డు దాటేందుకు తాళ్లు పట్టుకొని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్న విద్యార్థులు

రోడ్డు దాటేందుకు విద్యార్థుల కష్టాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అవసరం ఉన్న చోట సిగ్నల్స్ ఉండవు.. కనీసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూడా ఉండదు. ఎందుకంటే ఆ ప్రాంతంలో ఉండేది అంతా పేదలు. మూసాపేట్‌లోని కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న జనతానగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద దుస్థితి. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్డు దాటేందుకు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రెండు తాళ్లు పట్టుకొని తోటి విద్యార్థులు క్షేమంగా రోడ్డు దాటేందుకు ప్రతిరోజూ కొందరు విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, జిల్లా ఎడ్యుకేషన్ విభాగాలు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ అపూర్వ చౌహాన్

ఎంటమాజీ అధికారులతో జెడ్సీ సమీక్ష

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోన్‌లో సీనియర్ ఎంటమాలజీ సంధ్యపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆమెపై బల్దియా కమిషనర్ వేటువేసిన విషయం తెలిసిందే. దీంతో జోన్ ఎంటమాలజీ బాధ్యతలను ఎస్‌డబ్ల్యూఎం డీసీ మోహన్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. గురువారం ఎంటమాలజీ విభాగంపై జెడ్సీ అపూర్వ చౌహాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛదనం-పచ్చదనంతో పాటు సీజనల్ వ్యాధుల సర్వే, డ్రై డే, యాంటీ లార్వా, ఫాగింగ్ జరుగుతున్న తీరుపై సమస్యలు, ఫిర్యాదులపై ఆరా తీశారు. డెంగీపై ప్రజల్లో అవగాహన గురించి అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం తగదని, సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండి వెంటనే పరిష్కరిస్తామని జెడ్సీ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఆల్విన్‌కాలనీలో పర్యటన

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు, వాటి అమలు తీరుతెన్నులను పరిశీలించేందుకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ డివిజన్‌లో గురువారం పర్యటించారు. జయానగర్, రాఘవేంద్రకాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్-1, పాపమ్మబస్తీ, రాజీవ్‌గాంధీనగర్, మొగులమ్మబస్తీ, మహాత్మగాంధీనగర్ తదితర బస్తీలలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల పనులు పరిశీలించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ పరిధిలోని జరుగుతున్న సీసీ రోడ్ల పనులను డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, డీసీ కృష్ణయ్యతో కలిసి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా సీసీ రోడ్లను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌నాయక్, సంతోష్, ఉమేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్‌కు చెందిన షాహనబేగం, ఫతేనగర్‌కు చెందిన అజయ్‌నాయుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద షాహనబేగంకు రూ.2 లక్షలు, అజయ్‌నాయుడికి రూ.లక్ష మంజూరయ్యాయి. ఈ చెక్కులను గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.


కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడ బిడ్డలకు వరం

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

గాజులరామారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడ బిడ్డలకు వరమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండల కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్‌తో కలిసి 341 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ తల్లి దండ్రులకు భారం కాకూడదని, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారని, దీంతో మెట్టిన ఇంటిలో ఆడ బిడ్డలు గౌరవంగా అడుగు పెడతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జునరావు, ఆర్‌ఐలు రజనీకాంత్, రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్లో ద్విచక్రవాహనం నడుపుతూ ఎదురుగా వస్తున్న కార్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నజీర్ మియా తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన కుర్వ సాయితేజ(22) కూకట్‌పల్లిలోని ఓల్యాట్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తు అడ్డగుట్టలో హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం ఉదయం అడ్డగుట్ట హాస్టల్ నుంచి నిజాంపేట్ రోడ్‌వైపు వెళ్లేందుకు స్నేహితుడు హరిప్రసాద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై రాంగ్‌రూట్లో వెళ్తూ ఎదురుగా వస్తున్న కార్‌ను వేగంగా ఢీ కొట్టారు. అదుపు తప్పి కిందపడటంతో సాయితేజకు తీవ్ర గాయాలు కాగా హరిప్రసాద్ స్వల్పంగా గాయపడ్డారు. సాయితేజను సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్భుతం.. కోర్టు సముదాయం


కూకట్‌పల్లి ప్రధాన కోర్టు సముదాయం


ఫ్యామిలీ, పోక్సో భవనం

- సకల సౌకర్యాలతో కూకట్‌పల్లి కోర్టు భవనాలు
- జడ్జీలు, ఉద్యోగులు, కక్షిదారులకు వసతులు
- ఫ్యామిలీ, పోక్సో కేసుల విచారణకు ప్రత్యేక భవనం
- త్వరలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కైత్లాపూర్, అంబేడ్కర్‌నగర్ మధ్య సర్వే నంబర్ 972లో సుమారు ఐదెకరాల్లో ఆధునిక వసతులతో నిర్మించిన కూకట్‌పల్లి కోర్టు భవనాల సముదాయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సుమారు రూ.43 కోట్ల వ్యయంతో జీ ప్లస్ నాలుగు అంతస్తులతో ప్రధాన కోర్టు భవనం, రెండంతస్తుల్లో ఫ్యామిలీ, పోక్సో కేసుల విచారణ కోసం ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం చిన్నాచితక పనులు జరుగుతుండడంతో త్వరలో ప్రారంభోత్సవానికి ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నాడు కబ్జాకు యత్నం

సర్వే నంబర్ 972లోని ఐదెకరాల కోర్టు స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు అప్పట్లో తీవ్ర ప్రయత్నాలు చేశారు. 2014లో బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అర్జునపల్లి ప్రకాష్‌రావు దీన్ని అడ్డుకొని న్యాయపోరాటం చేసి సదరు వ్యక్తి నుంచి భూమిని కాపాడారు. 2016 మార్చి 5న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ్మోహన్‌రావు నూతన కోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడేళ్ల తర్వాత ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో 2021 ఫిబ్రవరి 21న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమాకోహ్లీ చేతుల మీదుగా పనుల ప్రారంభోత్సవం కోసం గ్రౌండ్ బ్రేకింగ్ సెర్మనీ నిర్వహించారు.

జడ్జీల త్యాగమేనా ?

ప్రస్తుతం నిర్మించిన కోర్టు ప్రాంగణంలో గతంలో న్యాయమూర్తుల కోసం నివాస సముదాయాలు నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు నిధులు కూడా విడుదల చేసింది. స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన జడ్జీలు.. పక్కనే రైల్వేలైన్ ఉండటం, జన సంచారం లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండడంతో నివాస సముదాయాలు వద్దని సూచించారు. దీంతో ప్రభుత్వం ఆ నిధులను వెనక్కి పంపించకుండా ఫ్యామిలీ, పోక్సో కోర్టు భవనం కోసం వినియోగించింది.

12న ఫారిన్ కోటా సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

- ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు
- జేఎన్‌టీయూ ఫారిన్ రిలేషన్స్ డైరెక్టర్ వసుమతి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విదేశీ కోటా కింద ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి ఈ నెల 12న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జేఎన్‌టీయూ ఫారిన్ రిలేషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ డి.వసుమతి తెలిపారు. అర్హులైన ఫారిన్ నేషనల్స్ (ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యు/ఎన్ఆర్ఐ) అభ్యర్థులకు స్పాట్ కౌన్సెలింగ్‌లో ముందు వచ్చిన వారికి మొదట (ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్) ప్రాతిపదికన సీట్లను కేటాయిస్తామని ఆమె స్పష్టం చేశారు. స్పాట్ కౌన్సెలింగ్ వచ్చే అభ్యర్థులు.. దరఖాస్తు నమూనా, విద్యార్హతలు, సాధారణ సూచనల కోసం జేఎన్‌టీయూహెచ్ డీయూఎఫ్ఆర్ వెబ్‌సైట్‌ను చూడవచ్చని తెలిపారు. ఇంజనీరింగ్ యూజీ (బీటెక్)కోర్సుల్లో 61, ఇంటిగ్రేటెడ్ పీజీ(బీటెక్+ఎంటెక్) కోర్సుల్లో 25, మేనేజ్‌మెంట్(బీబీఏ) కోర్సుల్లో 6సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బీటెక్ కోర్సులకు ట్యూషన్ ఫీజుగా ఎన్ఆర్ఐ అభ్యర్థులు ఏడాదికి 3,500 అమెరికన్ (యూఎస్) డాలర్లు, బీబీఏ కోర్సులకు 3 వేల డాలర్ల చొప్పున చెల్లించాలని, సార్క్ దేశాలకు చెందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు.


జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

కళాకారులకు గుర్తింపు, హెల్త్ కార్డులు ఇవ్వాలి

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు అందించి, అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ప్రజానాట్య మండలి ప్రతినిధులు గురువారం పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం సమర్పించారు. క్రీడా రంగానికి ఇచ్చే ప్రాధాన్యం కళాకారులకు కల్పించాలని వారు కోరారు. తెలంగాణలో గ్రామీణ కళలను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా సీపీఐ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే పర్యాటక అభివృద్ధి సంస్థలో సుమారు 20 ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధం చేయాలని కోరుతూ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మంత్రి జూపల్లి కృష్ణారావుకు మరో వినతి పత్రం సమర్పించారు.


గచ్చిబౌలి చౌరస్తా వద్ద రోడ్డును పరిశీలిస్తున్న జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

రహదారులను విస్తరించాలి: జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఐటీకి కీలకమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్‌కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. రహదారులు ఇరుకుగా ఉండి ట్రాఫిక్ నెమ్మదిస్తున్న ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన విస్తరించాలన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి గచ్చిబౌలి చౌరస్తా, రోలింగ్‌హిల్స్, నానక్‌రాంగూడ, ఓఆర్ఆర్ మూడో లెవల్ పై ఓవర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారులపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని, ఓఆర్ఆర్‌కు అనుసంధానంగా ఉన్న గచ్చిబౌలి కూడలిని మరింత సుందరీకరించే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, డీసీ రజనీకాంత్‌రెడ్డి, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాంగ్‌రూట్లో డ్రైవింగ్ చేస్తున్న వారి వాహనాలను పట్టుకున్న పోలీసులు

రాంగ్‌రూట్లో డ్రైవింగ్ చేస్తే చర్యలు

దుండిగల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై రాంగ్‌రూట్‌లో వాహనదారులు డ్రైవింగ్ చేసి తమ ప్రాణాలను పోగొట్టుకోవద్దని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ అన్నారు. గురువారం బాచుపల్లి ఎక్స్ రోడ్డులో కోక్కోలా కంపెనీ యూటర్న్ వద్ద రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో వస్తున్న 28 ద్విచక్ర వాహనాలు, ఆటో, ట్రాక్టర్‌ను సీజ్ చేసి మొత్తం 30 వాహనాలను బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు అనిల్, మల్లేశ్వర్, సుభాష్, పోలీసులు పాల్గొన్నారు.

నియోజవర్గం సమస్యలను పరిష్కరించాలి : ఎమ్మెల్యే

మియాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌ను గురువారం వేర్వేరుగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, లింక్‌రోడ్ల అభివృద్ధి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కమిషనర్, మేయర్, సిటీ ప్లానర్‌తో చర్చించామని తెలిపారు.


ఎనుమల తిరుపతిరెడ్డిని శాలువాతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడ్డి, అశోక్‌ముదిరాజ్, సతీష్


కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి ఎనుమల తిరుపతిరెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ కార్యదర్శి కర్క నాగరాజు, సీనియర్ నాయకుడు పెంటయ్య


ఎస్ఈ రవికుమార్‌తో గాంధీనగర్ పారిశ్రామిక వేత్తలు

విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని సికింద్రాబాద్ సర్కిల్ ఎస్ఈ రవికుమార్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని ఐలా కార్యాలయంలో ఐలా కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన, డీఈ భిక్షపతి, ఏడీఈ కేవల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పారిశ్రామిక రంగానికి నిరంతరం కరెంట్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ టీవీ రాజ్యం, అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి గౌడ్, సంఘం సభ్యులు అఖిల్, జగదీష్, సుధాకర్, రవీందర్‌రావు, చంద్రం, గౌతమ్, భేతాళ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



నానక్‌రాంగూడలో హోం శాంపిల్స్ సేకరణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో స్టార్ ఆస్పత్రి జేఎండీ, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ గూడపాటి, వైద్యులు

స్టార్ ఆస్పత్రి నుంచి హోం శాంపిల్స్ సేవలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి రాలేని వారు, వృద్ధులు, వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి శాంపిల్స్ సేకరించే కార్యక్రమానికి స్టార్ ఆస్పత్రి శ్రీకారం చుట్టింది. నానక్‌రాంగూడలో స్టార్ ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ రమేష్‌గూడపాటి, బంజారాహిల్స్‌లో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జరీడాక్టర్ లోకేశ్వరరావు సజ్జ గురువారం 'హోమ్ శాంపిల్స్' సేవలను ప్రారంభించారు. పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో శాంపిల్స్ సేకరిస్తామన్నారు. హోం శాంపిల్ కలెక్షన్ కోసం బుక్ చేయడానికి 9591104108 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆర్థోపెడిక్స్ సర్జన్ డాక్టర్ నీలం వెంకటరమణారెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే కూనశ్రీశైలంగౌడ్‌తో చర్చిస్తున్న డీసీ మల్లారెడ్డి

గాజులరామారంలో విగ్రహాల తొలగింపునకు సిద్ధం

కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం చౌరస్తా సుందరీకరణలో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న విగ్రహాలను తొలగించడానికి జీహెచ్‌ఎంసి అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కూన శ్రీశైలంగౌడ్, గాజులరామారం డీసీ మల్లారెడ్డి, ఈఈ కిష్టప్ప అధికారులు, నాయకులు గాజులరామారం చౌరస్తాను పరిశీలించారు. జంక్షన్ అభివృద్ధిలో భాగంగా స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ, స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఈఎస్ఐ ఆస్పత్రి ముందు ఉన్న స్థలంలోకి మార్చడానికి ఇరువర్గాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందికరంగా మారడంతో రోడ్డును విస్తరించి, జంక్షన్ అభివృద్ధి చేస్తున్నట్టు గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం నుంచి పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జేమ్స్, ఐలయ్య, చౌడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఫుట్‌పాత్‌పై ఉన్న బోర్డులను తొలగిస్తున్న సిబ్బంది

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని ఎన్‌హెచ్-44 రహదారికి సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను కుత్బుల్లాపూర్ సర్కిల్, టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, సివిల్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. పేట్ బషీరాబాద్‌లోని ఫుట్‌పాత్‌పై వెలిసిన టీ బండ్లను, టిఫిన్ సెంటర్లను తదితర వాటిని తొలగించిన అధికారులు, మళ్లీ ఈ ప్రాంతంలో బండ్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కూల్చి వేతల్లో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతి, ట్రాఫిక్ సీఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తి అరెస్ట్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలను మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీమ్ తొలగించారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపి వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన వికాస్ దూలపల్లి పారిశ్రామిక వాడలోని స్వస్తిక్ స్టీల్ గొడౌన్ వద్దనే ఉంటూ ప్రక్కనే గల ఖాళీ ప్రదేశంలో గంజాయి మొక్కలను పెంచుతున్నారు. గురువారం సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీమ్ నాలుగు మొక్కలను తొలగించి వికాస్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.


గంజాయి మొక్కలతో నిందితుడు


గాజులరామారం చిత్తారమ్మదేవినగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మొక్కలు నాటుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి

కొనసాగుతున్న

'స్వచ్ఛదనం-పచ్చదనం'

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): నాలుగో రోజు గురువారం కూడా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మొక్కలను నాటడంతోపాటు చెత్త, మట్టికుప్పలను తొలగించారు. రోడ్లకు మరమ్మతులు చేసి మొక్కలు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.


జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ చెరువు వద్ద మొక్కను నాటుతున్న కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి, కుత్బుల్లా పూర్ సర్కిల్ డీసీ నర్సింహా


హెచ్ఎంటీహిల్స్‌లో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు


ఇందిరానగర్‌లో స్వచ్ఛదనం - పచ్చదనంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


కొంపల్లి పురపాలక సంఘంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్



దుండిగల్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ బాబూమోసెస్